# పండుగా... నీకు జోహార్!

ఆటోలోంచి దిగగానే అనుకున్న ప్రకారం పదిరూపాయలందించాడు భుజంగం. ఆ నోటందుకోకుండానే ఆటోడ్రైవర్ "మరో ఐదొస్తుంది సార్!" అన్నాడు ఎటో చూస్తూ నిర్లక్ష్యంగా.

"నువ్వడిగింది పదిరూపాయలే కదా? ఇంకా అయిదెందుకు?" అడిగాడు భుజంగం.

అలా అడుగుతున్నతడ్ని అమాయకుడ్ని చూసినట్టు ఎగాదిగా చూసాడా ఆటోడ్రైవర్. అంతలోనే "అన్నీ తెలిసిన మీరు కూడా ఏమీ తెలియనట్లడుగుతారేంటి సార్!" అన్నాడు అదేదో అతి సామాన్య విషయమన్నట్టు.

దాంతో బిక్కమొహం వేసాడు భుజంగం. "అందరికీ తెలిసి తనకు మాత్రమే తెలియని విషయమేమై వుంటుందా?" అని ఆలోచించాడు. ఫలితం శూన్యం.

అలా ఆలోచనల్లో ఉన్న భుజంగంతో ఆటోడ్రైవర్ "ఏంటి సార్! ఏమీ ఎరగని వాళ్లలా అలా బిక్కమొహం వేస్తారు? ఆ అయిదూ దసరా మామూలు" అన్నాడు చిక్కుముడి విడదీసిన వాడిలా.

గీరుకుపోయిన చర్మంమీద కారంగుండ తగిలనట్లు చురుక్కుమందా మాట వినగానే భుజంగానికి. దాంతో ఖస్సస్... మని లేచాడా ఆటోడ్రైవర్ మీద. "నీ పిండం పిట్టలకి పెట్ట. అదేదో ఇంటర్నేషనల్ ఎఫైర్ లాగ ఎంత బిల్డప్ ఇచ్చావురా! టెన్షన్‌తో చంపావుకదా! అయినా ప్రతీ అణాకాణీ ఆవారా వెధవకీ ఇదో అలవాటైపోయింది. దసరా మామూలట... దసరా మామూలు" అంటూ ఆగాడు వగరుస్తూ.

అతడన్న మాటల్లో "పిండం" అన్న మాటకి అర్థం ఆ ఆటోడ్రైవర్‌కి తెలియదు కాబట్టి పెద్ద గండం తప్పింది భుజంగానికి. అయినా మిగిలిన మాటలు వింటూనే "బిల్డప్పూ... లాకప్పూ... అంటూ ఎక్కువ మాటలొద్దు సారూ! మీరిచ్చేది ఆఫ్టరాల్ అయిదు రూపాయలు. దానికింత... అక్కర్లేదు" అన్నాడు పరమ నిర్లక్ష్యంగా.

దాంతో అంటుకున్న తారాజువ్వలా 'ర...య్యి'మని లేచాడు భుజంగం. "నీ మొహం మండ. నీ కంటికి నేను వెర్రివెంగళప్పలా కనబడుతున్నానేంట్రా! నీ బతుక్కి దసరా మామూలు కావాల్సొచ్చిందా! ఇలా అడిగిన ప్రతి అణాకాణీ ఆవారాగాడికల్లా ఇవ్వడానికి నా తాత కూడబెట్టిన ముల్లె ఏమైనా ఉందనుకున్నావా?" అంటూ వెర్రిగా కేకలేసాడు. దానికి కారణం అతని మనసులో రగులుతున్న బాధ. నెల్లాళ్ల పొద్దయింది ఈ తద్దినం మొదలై. వినాయక చవితి పండుగ వెళ్లాక కరెంట్ రీడింగ్ తీసుకోవడానికొచ్చినవాళ్లు మొదలెట్టారు. "సార్! దసరా మామూలు" అంటూ బుర్రగోక్కుంటూ.

ఆ మాట విన్న భుజంగం "ఇప్పుడెక్కడి దసరా... రెణ్నెల్లుంది కదా?" అన్నాడు.

అయ్యగారి శ్రీనివాసరావు

“నిజమే సార్. కాని మళ్లీ మేం రీడింగ్‌కొచ్చే సరికి దసరా వెళ్లిపోతుంది సార్. ఏదో మీకు తోచినంత...” అన్నాడు వివరణ ఇచ్చి, చివరగా నసిగేస్తూ.

ఆ మాటతో అంత దీనంగా అడుగుతున్నారుకదా అని అయిదు రూపాయలు వాళ్ల చేతిలో పెట్టాడు భుజంగం. అది చూస్తూనే అందులో ఒకడు వెర్రినవ్వొకటి నవ్వుతూ “మాలాంటి వాళ్లతో మీకు జోకులేంటి సార్” అన్నాడు.

ఆ మాట అతడెందుకన్నాడో అర్థంకాని భుజంగం “నీతో నేను జోకులెప్పుడేసాను” అన్నాడు మాడిపోయిన గారెలా మొహంపెట్టి.

ఆ మాటకు రెండో వ్యక్తి “లేకపోతే ఏంటి సార్! యాభైరూపాయలియ్యాలసిన దసరా మామూలుకి అయిదు రూపాయలిస్తే జోక్కాకమరేంటి సార్? రండి సార్ మా కవతల పనుంది” అన్నాడు బాకీదారుణ్ణి అప్పిచ్చిన వాడడిగిన లెవెల్లో.

దాంతో ఒళ్లుమండిన భుజంగం “ఏభై కావాలా?... వందొద్దా?...” అన్నాడు వ్యంగ్యంగా. అప్పటికే లోపల రక్తం మరగడం మొదలైంది భుజంగానికి.

“లేద్సార్! ఈ సంవత్సరానికింతే ఫిక్స్ చేసాం. అంతకంటే ఎక్కువిచ్చినా తీసుకోం” అన్నాడు ఆ ఇద్దర్లో ఒకడు. అలా వాళ్లన్న ఒక్కొక్క మాట వింటుంటే పొయ్యిమీద పెట్టిన పాల



లాగా రాన్రానూ పెరిగింది బీపీ. ఆ చివరిమాట వినేసరికి పగిలిన అగ్నిపర్వతం లావా ఎగజిమ్మినట్లు తన మనసులోని కోపాన్నంతా వాళ్లమీద చూపించేసాడు. అతడి ఉగ్రరూపం చూసి ఏమనుకున్నారో గాని ఆ సర్వీసు నంబరు దగ్గర ఏదో రాసుకుని మౌనంగా వెళ్లిపోయారు.

అయితే అంత సులువుగా వాళ్లు వెళ్లి పోవడం వెనక ఆంతర్యం బిల్ కట్టడానికి వెళ్లినపుడు గాని తెలిసిరాలేదు భుజంగానికి. నెలాఖరు. కూర ఖర్చుకే కటకటలాడుతున్న రోజులు. బిల్ కట్టడానికి ఆఖరు రోజు కావడంతో దాని పేరు చెప్పి నెల ఖర్చులకి కూడా కలిపి అప్పు చేసిన భుజంగం బిల్ కట్టడానికెళ్లాడు.

ఆ బిల్ కట్టించుకునే వ్యక్తి ఇతడి సర్వీస్ నంబరు చూడగానే "సార్! మీరు రీడింగ్ తీయడానికికొచ్చిన బాయ్సుకివ్వాల్సిన దసరా మామూలు పెండింగ్‌లో ఉందిసార్. అది, మాది కలిపి ఇప్పుడిస్తేనే బిల్ తీసుకుంటాం" అన్నాడు. ఆ మాటతో భుజంగం బుర్ర బొంగరంలా తిరిగింది. ఎన్నోరకాల చెప్పిచూసాడు. సామదానబేధోపాయాలు ప్రయోగించాడు. ఇలాంటి పరిస్థితిలో తగువు పెట్టుకోకూడదని దండోపాయం ప్రయోగించలేదు. అక్కడంతమందున్నారు. వాళ్లూ తనలాగే బిల్ కట్టడానికొచ్చినవాళ్లే. అందరూ బాధితులే. ఏ ఒక్కరైనా తనకి సపోర్ట్ రారా అని ఆశించిన అతడి ఆశ అడియాసే అయింది. వాళ్లెవరూ కలగజేసుకోలేదు సరి కదా! తిరిగి తనకే పాఠాలు చెప్పడం మొదలెట్టారు కొందరు. తనను పిసినారిని చూసినట్టు చూసినవాళ్లు కొందరు. జాలిగా చూసేవాళ్లు కొందరు. చాటుగా నవ్వుకుంటున్నవాళ్లు కొందరు. అందర్నీ చూస్తున్నాడు భుజంగం. నీర్సం వచ్చింది. అయినా ఫలితంలేదు. దాదాపు చేతులు నులిపి బలవంతంగా లాక్కున్నట్టు లాక్కున్నారు రెండురకాల దసరా మామూళ్లని.


అలా మొదలైన దసరా మామూళ్ల ప్రహసనం అలా అలా కొనసాగింది. ఉధృతమైంది. పాలుపోసేవాడు, కొళాయినీళ్లు ఇప్పేవాడు. పేపర్ వేసేవాడు, రోడ్డు తుడిచేవాడు, కాలువ తుడిసేవాడు, చెత్తలెత్తేవాళ్లు, ఇస్త్రీ చేసేవాడు... ఇలా వాళ్లు వీళ్లని లేదు... మనిషి ముఖం కనబడితే చాలు... దసరా మామూలడిగేసేవారెవరోఒకరు.

కొన్నాళ్లు మామూళ్లివ్వకుండా తప్పించుకున్నాడు. ఆ కాలంలో అతడు పడ్డ పాట్లు మామూలు పాట్లు కాదు. కుక్కపాట్లు. ఇస్త్రీ బండి వాడికి దసరా మామూలు ఇవ్వకపోతే అసలు మడత బదులు మరో దగ్గర మడత వచ్చేటట్లు ఇస్త్రీ చేసేవాడు. దాంతో రెండు మడతలతో బట్టలు అసహ్యంగా తయారయేవి. పోనీ వాణ్ని మార్చి, మరొకడికి ఇద్దామంటే ఆ అవకాశమే లేదు. ఎందుకంటే ఆ కాలనీకంతటికీ వాడొక్కడే కాంట్రాక్ట్.

పాలవాడు కొలత తగ్గించి పొయ్యడమో, నీళ్లు ఎక్కువ కలిపేయడమో చేసేవాడు. వాడి దగ్గర వాడుక మానేద్దామా అంటే తన బడ్జెట్‌కి తగిన చవకలో మరెవరూ ఇవ్వరాచుట్టుపక్కల.

పేపర్‌బోయ్ ఒకరోజు ముఖానికి తగిలేట్టు పేపర్ విసిరాడు. మరో రోజు పూలమొక్కలకి నీళ్లు పోస్తుంటే ఆ నీట్లో పడేటట్లు విసిరేసాడు. అదీ ఇదీ కాకపోతే ఏదో ఒక ఎడిషన్ పేపర్ తప్పించేసేవాడు. వాడికేంపోయింది? నష్టపోతే ఏజంట్ కదా నష్టపోయేది. మానేసినా బాధ లేదు. మళ్లీ బుర్రతిని బుక్‌చేయడానికి సేల్స్ ప్రమోటర్స్ ఉండనే ఉన్నారాయె.

రోడ్డు తుడిచేవారు, కాల్వతీసేవారు సరేసరి. మొదటిరోజు వాళ్లింటి దగ్గర తుడవడం మానే




సారు. రాన్రాను వారి నిరసన తీవ్రతరంచేసి ఎక్కడెక్కడి చెత్తా కూడదీసి వాళ్ల గుమ్మం ముందు పోసేవారు. పనిమనిషి దగ్గర ఉండనే ఉంది పెద్దాయుధం. అదే నాగా పెట్టడం. వచ్చినా వదిలీ వదలకుండా, అరకొరగా తోమేసి, సబ్బుపిసర్లో, జిడ్డుముద్దలో ఉంచేసి కడిగిపడేసేది. కూరలమ్మేవాడు, ఘూర్ఖా, కేబుల్ కనెక్షన్ వాళ్లు, ఫోన్‌వాళ్లు, చిన్నచిన్న రిపేర్లు చేసే వాళ్లు వీళ్లంతా ఎవరి స్థాయిలో వారు నిరసన తెలిపి భుజంగాన్ని ఓడించి, దసరామామూలు పట్టుకెళ్లిపోయారు. ఆఖరుకి ఇంటికి రోజూ వచ్చే ముష్టివాడు కూడా ఘరానాగా మామూలు వసూలుచేసుకుని వెళ్లిపోయాడు. అయిదూ పదీ ఇస్తే తీసుకునే వాళ్లు కొందరైతే, పాతిక, ఏభైకి [illegible] వాళ్లు కొందరు.

అలా అలా ఇచ్చీ ఇచ్చీ చివరికి పెద్దమొత్తం అప్పు చెయ్యవలసి వచ్చింది. అదైనా దసరా మామూళ్ల నిమిత్తమే. అప్పట్నుంచి అలా అప్పుల ఊబిలో చిక్కుకునే పరిస్థితులు తెచ్చిన దసరా మామూలు మాట వింటేనే చిర్రెత్తుకొస్తూంది. అందుకే ఇప్పుడీ ఆటోవాలా అలా అడిగేసరికి అంతలా రియాక్ట్ అయ్యాడు.

* * *

అనుకోకుండా మధ్యలో తెలివొచ్చింది కనకానికి. తన నిద్రాభంగానికి కారణమేమిటో తెలీక అటూఇటూ చూస్తోంది. ఫేన్ తిరిగే చప్పుడు తప్ప, అంతటా నిశ్శబ్దమే. కాకపోతే జాగ్రత్తగా గమనిస్తే ఏదో చిన్న ధ్వని. అది కూడా తనకు అతి దగ్గర్నుంచి వస్తూంది. అదేమిటో తెలుసుకోవాలని ఎంత ప్రయత్నించినా ఆ గదిలో అలముకున్న చీకటివల్ల ఏదీ స్పష్టంగా కన్పించని పరిస్థితి. అయినా అతి కష్టమ్మీద కనిపెట్టగలిగింది ఆ ధ్వని తన పక్కనున్న భర్త దగ్గర్నుంచని. నెమ్మదిగా తడుముకుంటూ వెళ్లి, అంచనామీద స్విచ్ నొక్కింది. స్టార్టర్ వీక్ అయిన ట్యూబ్‌లైట్ మధ్యతరగతి కుటుంబ యజమానిలాగా నీర్సంగా వెలిగింది. ఆ వెలుగులో అతి దీనంగా మొఖం పెట్టుకుని దిగులు

గా కూర్చున్న భర్త ముఖాన్ని చూసి ఒక్క క్షణం ఉలిక్కిపడింది. తర్వాత తేరుకుని నెమ్మదిగా అంది "ఎందుకండీ అంత టెన్షన్ పడుతున్నారు?" అని. ఎందుకంటే ఈమధ్య చాలా రోజుల్నుంచి భర్త అలాగే ఉండడం గమనిస్తోంది. కానీ ఇంతలా నిద్ర మానుకుని బాధపడుతున్నాడనుకోలేదు.

అలా అడిగిన కనకం మాట విన్న భుజంగం "ఏంచెయ్యమంటావు కనకం? చూస్తున్నావు కదా అప్పులు. ఇవన్నీ ఎలా తీర్చాలో అర్థంకావడంలేదు. అయినా కడుపు కింత తిన్నామనా? కంటికింపుగా ఒక బట్ట కట్టుకోవడానికి కొన్నామనా? లేకపోతే ఇల్లు కట్టామనా? పెళ్లి చేసామనా? దేనికి ఈ అప్పులు? అక్కడైదు, ఇక్కడ మూడు, మరో దగ్గర రెండు... ఇలా దొరికిన చోటల్లా అప్పులు వాడేసాను. ఇవన్నీ ఎలా తీరుతాయి చెప్పు?" పగటి వేషగాడ్ని అసురసంధ్య వేళలో చూసి, నిద్దట్లో జడుసుకున్న చంటి పిల్లాడిలా వణికిపోతూ అన్నాడు భుజంగం.

అతడ్నలా చూస్తుంటే జాలేసింది కనకానికి. కాని అంతలోనే కలిపురుషుడు ప్రవేసించిన ద్వాపరయుగం మనిషిలా మారిపోయింది. దానికి కారణం ఆమె మదిలో అప్పుడే వచ్చిన ఆలోచన. ఆ ఆలోచన ఆచరణలో పెట్టడానికి తగిన సమయమిదే. అందుకే నెమ్మదిగా పిలిచింది.

ఆ పిలుపులో ఆత్మీయత. కరెంట్ పోయిన మిట్టమధ్యాహ్నపు వేసవి వేళలోని మనిషి స్థితిలో ఉన్న తనకి, కూల్‌డ్రింగ్ తాగే స్ట్రాతో మొహం మీదుగా ఊదినట్లనిపించిందా పిలుపు.

ఆత్మీయంగా పిలిచిన ఆ పిలుపుతో "ఏమిటి?" అనడిగాడు కరిగిపోతూ.

"ఇలా బెంగెట్టుకుంటూ కూర్చుంటే ఏం ప్రయోజనం చెప్పండి! అయిందేదో అయిపోయింది. ఈ వడ్డీలు, అప్పులు... వీటన్నిటికంటే నన్నో మాట చెప్పమంటారా?" అడిగింది నెమ్మదిగా.

మండువేసవిలో కరెంట్ ఉన్న ఫ్రిజ్‌లోని కూలింగ్ వాటర్ దొరికినంత ఆనందమన్పించిందామాట. అలాంటపుడు వద్దనెలాగంటాడు?

మధ్యతరగతి మొగుళ్లని అంత సులువుగా నమ్మరాయిల్లాళ్లు. కారణం? వారికేమాటంటే ఏ కోపమొస్తుందో తెలీదు. అందుకే నెమ్మదిగా అంది "చిరాకు పడనంటేనే" అని మాట తీసుకుని చెప్పడం మొదలెట్టింది.


"ఎలాగూ పదివేలు అప్పుంది. నెలకి వడ్డీ మూడునాలుగు వందలెలాగూ కట్టాలి కదా! ఎందుకంటే మూడు రూపాయలు, నాలుగు రూపాయలు లెక్కన వడ్డీకి వాడారు. దానిబదులు ఒక సులువు చెప్పనా?" అంది.

"చెప్పు'... అన్నాడు నెమ్మదిగా నడుంమీద చెయ్యివేసి రాస్తూ.

ఆ చర్యలోనే అతడి మనసెంత ఖుషీగా వుందో అర్థంచేసుకుని నెమ్మదిగా అంది... "మీరు ఎన్నాళ్లనుంచో నాకు నెక్లెస్ చేయిస్తానంటున్నారు. కాని కుదరడంలేదు కదా?" అని ఆపేసి, "మీరు మాత్రం కోపగించుకోనంటేనే" అంటూ ఆగిపోయిందామె. ఎందుకంటే ఆమె మధ్యతరగతి ఇల్లాలు.

ఆ మాటకి భార్యమీద జాలేసింది. అప్పుడప్పుడు తన చిరాకు ప్రవర్తనకి సిగ్గనిపించి, "లేదులే... చెప్పు..." అన్నాడు ఆమెని ఒడిలోకి లాక్కుంటూ.

ఆమె చెప్పడం కొనసాగించింది "అక్కడా ఇక్కడా అప్పులకంటే మీ పి.ఎఫ్.లో లోన్ తీసుకుంటే అన్ని సమస్యలూ తీరిపోతాయి కదా. పాతికవేలు లోన్ తీసుకుంటే పదివేలు




అప్పు తీరిపోగా, మిగిలిన పదిహేనువేలు పెడితే తులంనర నెక్లెస్ వచ్చేస్తుంది. అదీకాక నెలకిప్పుడెలాగూ నాలుగు వందలు వడ్డీ కడుతున్నారు కదా. దానిమీద మరికొన్ని వందలు కలిపితే ఇరవై నెలల్లో మీ అప్పు తీరిపోతుంది. నాకు నక్లెస్ మిగిలిపోతుంది" అంది.

ఆ మాటతో "ఇదేదో బాగానే ఉందిలాగుంది" అనుకుని, అంతలోనే ఏదో గుర్తొచ్చి నతడు తుళ్లిపడ్డాడు. అంతలోనే తమాయించుకుని, "అయితే నీకూ దసరా మామూలు కావాలంటావ్! అంతేనా...?" అన్నాడు.

అలా అంటున్న అతడి ముఖం ప్రశాంతంగానే ఉందని గ్రహించినామె "దసరా వెళ్లిపోయి పదిహేను రోజులైపోయింది కదా! లోన్ శాంక్షన్ అయి. నక్లెస్ తయారయేసరికి సంక్రాంతి వస్తుంది కాబట్టి ఇది పండగ మామూలు" అంది.

ఆ మాటకి కిలకిలా నవ్వాడు భుజంగం. అంతలోనే మంచి సీన్‌లో కరెంట్ పోయిన టీవీ ప్రేక్షకుడిలా ముఖం పెట్టాడు ఏదో గుర్తొచ్చి.

పరమాన్నం నోట్లో పెట్టగానే కంకరరాయి పంటికి తగిలినట్లు ఏదో కీడు శంకించిన కనకం "ఏమైందండీ..." అంది. ఆమె ఆశకు అప్పటికే తిలోదకాలు ఇచ్చేసింది.

ఆ మాటకి భుజంగం "లోన్ శాంక్షన్ చెయ్యడానికీ మామూలివ్వాలి కాబోలు..." అన్నాడు.

అది విన్న కనకం తేలికగా నిట్టూరుస్తూ "మీరే అంటుంటారు కదా, "నూరు గేదెలని కడిగిన వాడికి ఒక సాలగ్రామం (దేవతా విగ్రహం) లెక్కా... అని" అంది.

ఆ మాటకి భుజంగం భార్యవైపు మెచ్చుకోలుగా చూస్తూ "ఏమైనా నువ్వు కూడా చమత్కారివేనోయ్" అన్నాడు ఆమెను కౌగలించుకుంటూ.

అతడి సమస్యకి పరిష్కారం చూపి, ఆమె ఆ క్షణంలో అందాలరాశిలా, అపరంజిబొమ్మలా ఇంకా ఇంకా... లా... లా... కనబడుతోంది అతడి కళ్లకి. అతడి మనసులో ఆనందభావనే ఆ సంతోషానికి కారణం. ●